## కార్ల అమ్మకం పేరిట మోసం







## రాజీవ్‌గాంధీ జయంతి



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in

20-8-2025 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2


## మధ్యాహ్న భోజన మెనూపై నిర్లక్ష్యం వద్దు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూను పక్కాగా అమలు చేయాలని ఆర్డీవో పార్థసింహారెడ్డి అన్నారు. ఎల్లారెడ్డి మోడల్ స్కూల్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనాన్ని, వాష్ రూమ్, లైబ్రరీని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రిన్సిపల్‌కు సూచించారు. ఆయన వెంట తహశీల్దార్ ప్రేమ్ కుమార్, ప్రిన్సిపాల్ గాంధీ, వైస్ ప్రిన్సిపాల్ జహంగీర్, ఉపాధ్యాయులు రాజశేఖర్, బల్వంత రావు, లక్ష్మణ్ సింగ్, విద్యారమణ తదితరులున్నారు.



## శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద.. 26 గేట్ల ద్వారా నీటి విడుదల

**అక్షరటుడే, ఆర్మూర్ :** శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో భారీగా వచ్చి చేరుతోంది. మంజీరతో పాటు గోదావరికి వరద పోటెత్తడంతో జలాశయంలో భారీగా ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో ప్రాజెక్టు 26 గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎస్సారెస్పీకి ప్రస్తుతం 1.65 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 26 వరద గేట్ల ద్వారా 1,02,850 క్యూసెక్కులు గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. కాల్వలు, వరద గేట్ల ద్వారా మొత్తం 1,31,717 క్యూసెక్కుల ఔట్ ఫ్లో నమోదవుతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1087.2 అడుగుల (67.05 టీఎంసీలు) నీరు ఉంది. శ్రీరామ్‌సాగర్‌కు ఎగువ నుంచి భారీగా ఇన్‌ఫ్లో వస్తుండడంతో వరద కాలువ ద్వారా మిడ్ మానేరు కు నీటిని తరలిస్తున్నారు. మంగళవారం 18 వేల క్యూసెక్కులు వరద కాలువకు విడుదల చేసిన అధికారులు.. బుధవారం 20 వేల క్యూసెక్కులకు పెంచారు. దీంతో సిరిసిల్ల జిల్లాలోని మిడ్ మానేరు ప్రాజెక్ట్ జలకళను సంతరించుకుంది. మరోవైపు ఎస్సారెస్పీ కాకతీయ కాలువ ద్వారా 5 వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా మూడు వేలు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు వదులుతున్నారు.

## కాలుష్య రహిత పర్యావరణాన్ని నెలకొల్పాలి



**అక్షరటుడే, లింగంపేట:** కాలుష్య రహిత పర్యావరణాన్ని నెలకొల్పేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో తాడ్వాయి మండలం సంతాయిపేట్ భీమేశ్వరాలయ పరిసర అటవీ ప్రాంతంలో బుధవారం విత్తన బంతులు విసిరే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అటవీ ప్రాంతంలో విద్యార్థులతో కలిసి సీడ్‌బాల్స్‌ను వేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని అన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే.. ప్రతిఒక్కరూ మొక్కలు నాటుతూ, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి గ్లోబల్ వార్మింగ్‌ను నివారించాలని సూచించారు. కాలుష్య రహిత పర్యావరణాన్ని నెలకొల్పడానికి కృషి చేయాలన్నారు. జిల్లాలో ప్రతి పాఠశాలలోనూ సీడ్‌బాల్స్ తయారు చేశారని.. ఇలా లక్షకు పైగా తయారయ్యాయని కలెక్టర్ వివరించారు. విద్యార్థులను ప్రోత్సహించి ఈ బృహత్కర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ప్రతి పాఠశాలలోని ఉపాధ్యాయులను, జిల్లా సైన్స్ అధికారిని కలెక్టర్ అభినందించారు. అనంతరం తాడ్వాయి మండలంలోని చిట్యాల, సంతాయిపేట గ్రామాల్లో బుధవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఇంటి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట డీఈవో రాజు, ఇరిగేషన్ ఈఈ మల్లేష్, ఎంపీడీవో సాజిద్ అలీ, ఎంపీవో సరిత రెడ్డి, ఎంఈవో రామస్వామి ఉన్నారు.

# 'మద్యం' టెండర్లకు నోటిఫికేషన్



- దరఖాస్తు ఫీజు పెంచిన ప్రభుత్వం
- అప్లయ్ చేయడానికి నిరీక్షిస్తున్న పలువురు
- కొత్తగా రిజర్వేషన్లు అమలు
- ఉమ్మడి జిల్లాలో 151 వైన్ షాపులు

**రాష్ట్రంలో మద్యం దుకాణాల లైసెన్స్‌ల జారీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రంలో రెండేళ్లకు ఒకసారి మద్యం దుకాణాల కోసం టెండర్లు నిర్వహిస్తారు. 2025 డిసెంబర్ 1 నుంచి 2027 నవంబర్ 30 వరకు లైసెన్స్‌ల కోసం తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని మద్యం దుకాణాలను దక్కించుకోవడానికి పలువురు ప్రయత్నాలు చేస్తున్నారు. - అక్షరటుడే, నిజామాబాద్**



రాష్ట్ర ప్రభుత్వం మద్యం దుకాణాలను కేటాయించడానికి నోటిఫికేషన్ జారీ చేసింది. లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి గతంలో రూ.రెండు లక్షలు ఫీజు వసూలు చేసేవారు. ప్రస్తుతం దానిని రూ.3 లక్షలకు పెంచారు. దీంతో ప్రభుత్వానికి దరఖాస్తుల రూపంలో భారీగా ఆదాయం రానుంది. ఇప్పటికే మద్యం ధరలను పెంచిన ప్రభుత్వం తాజాగా లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసుకునే ఫీజును పెంచడం గమనార్హం.

### డ్రా ద్వారా ఎంపిక

మద్యం దుకాణాల కోసం ప్రభుత్వం త్వరలో దరఖాస్తులు స్వీకరించనుంది. ఇప్పుడు ఉన్న దుకాణాల లైసెన్స్ గడువు నవంబర్ 30 వరకు ఉంది. దీంతో డిసెంబర్ 1 నుంచి కొత్తగా లైసెన్స్ పొందిన వారు విక్రయాలు జరుపుతారు. దీంతో లైసెన్స్‌ల జారీ కోసం త్వరలోనే దరఖాస్తులు స్వీకరించే అవకాశం ఉంది. అయితే ప్రభుత్వం ఇంకా తేదీలు ప్రకటించలేదు. టెండర్ కోసం దరఖాస్తు చేసుకునే ఫీజును మాత్రం రూ. 3 లక్షలకు పెంచింది. ఉమ్మడి జిల్లాలోని ఒక్కో దుకాణానికి పదుల సంఖ్యలో దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది. చాలా మంది మద్యం దుకాణాలను దక్కించుకోవాలని ప్లాన్ చేస్తున్నారు. అయితే డ్రా ద్వారా లైసెన్స్ కోసం దరఖాస్తులను ఎంపిక చేస్తారు.

### లైసెన్స్ ఫీజులు

2011 జనాభా లెక్కలను అనుసరించి 5 వేల జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.50 లక్షల లైసెన్స్ ఫీజు నిర్ణయించారు. 5 వేల నుంచి 50వేల జనాభా గల ప్రాంతాల్లో దుకాణాలకు రూ.55 లక్షలు, 50 వేల నుంచి లక్ష జనాభా ఉన్న ఏరియాల్లో రూ.60 లక్షలుగా నిర్ణయించారు. లక్ష నుంచి 5 లక్షల జనాభాకు రూ.65 లక్షలు, 5 లక్షల నుంచి 20 లక్షల జనాభాకు రూ.85 లక్షలు, 20 లక్షలపై చిలుకు జనాభా గల ప్రాంతంలోని దుకాణాలకు రూ.కోటి పది లక్షల ఫీజు నిర్ణయించారు.

### టెండర్లలో రిజర్వేషన్లు

మద్యం దుకాణాల కేటాయింపులో రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం గౌడ్‌లకు రిజర్వేషన్ అమలు చేయగా.. తాజాగా కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీలకు కూడా రిజర్వేషన్ అమలు చేస్తూ నిర్ణయం తీసుకుంది. గౌడ్‌లకు 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం రిజర్వేషన్లు కల్పించింది. 6 శ్లాబ్‌లలో లైసెన్స్‌లు జారీ చేయాలని ఎక్సైజ్ శాఖ నిర్ణయించింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 151 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఇందులో నిజామాబాద్‌లో 102, కామారెడ్డిలో 49 షాపులు ఉన్నాయి. ఇందులో పలు దుకాణాలను ఆయా కేటగిరీలకు రిజర్వ్ చేయనున్నారు.

### సిండికేట్‌గా మారే అవకాశం

ప్రతి సారి మద్యం దుకాణాల టెండర్లు దక్కించుకోవడానికి పలువురు బడాబాబులు సిండికేటుగా మారుతున్నారు. ఇప్పుడు వ్యాపారులు, రాజకీయ నాయకులు సిండికేట్ అయి దరఖాస్తులు చేసుకోవడానికి ప్లాన్ చేస్తున్నారు. ఒక్కో దుకాణానికి ఎక్కువ మొత్తంలో దరఖాస్తులు సమర్పించనున్నారు. అయితే దరఖాస్తు ఫీజు పెంచడంతో గతంతో పోలిస్తే అప్లికేషన్లు తగ్గే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరేస్తాం

**అక్షరటుడే, ఇందూరు:** స్థానిక సంస్థల ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరడం ఖాయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం మహాజన సంపర్క్ అభియాన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త బూత్‌స్థాయి నుంచి ప్రతి ఇంటికి చేరుకొని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేర్లు మార్చి క్రెడిట్ తీసుకుంటుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల నడ్డి విరుస్తుందే తప్ప చేసిందేమీ లేదన్నారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎన్డీఏ నుంచి బీసీ అభ్యర్థి నిలబడితే కాంగ్రెస్ కావాలని ఓడగొట్టాలని కంకణం కట్టుకుందన్నారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ నేతృత్వంలో జిల్లాలో రెండుసార్లు సర్వే నిర్వహించారని దినేష్ కులాచారి స్పష్టం చేశారు. గెలుపు గుర్రాలకే టికెట్ కేటాయించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ బూత్ కమిటీలను త్వరగా ఏర్పాటు చేయాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం ఉంటుందని హామీ ఇచ్చారు. ఎంపీ అర్వింద్ ధర్మపురి కార్యకర్తల సంక్షేమానికి ప్రత్యేక నిధి ఏర్పాటు చేసి వారికి అండగా నిలుస్తున్నారని గుర్తుచేశారు. బలమైన బూత్ ఉంటే సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు గెలవగలమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి, నాయకులు గంగారెడ్డి, స్రవంతి రెడ్డి, పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, న్యాలం రాజు, నాగోల్ల లక్ష్మీనారాయణ, పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి

## విద్యుత్ స్తంభాల నుంచి కేబుల్ వైర్లు తొలగింపు



**అక్షరటుడే, లింగంపేట:** లింగంపేట, గాంధారి మండల కేంద్రాల్లో విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లను విద్యుత్ సిబ్బంది బుధవారం తొలగించారు. ఏడీఈ మల్లేష్ మాట్లాడుతూ.. ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి ఆదేశాల మేరకు విద్యుత్ ప్రమాదాల నివారణకు విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుల్ వైర్లను, ఇంటర్నెట్ కేబుళ్లను తొలగిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్నెట్, కేబుల్ ఆపరేటర్లు సహకరించాలని కోరారు. రానున్న వినాయక చవితి, దుర్గామాత విగ్రహాల ఊరేగింపు సందర్భంగా ప్రభుత్వం తీసుకున్న చర్యల్లో భాగంగా వీటిని తొలగిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఈలు సాయినాథ్, హరీష్, సబ్ ఇంజనీరింగ్ భాస్కర్, లైన్మెన్ వహీద్, అసిస్టెంట్ లైన్మెన్ యాదిరెడ్డి, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మండళ్ల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** గణేష్ మండళ్ల నిర్వాహకులు నిబంధనలు తప్పకుండా పాటించాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సూచించారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. గణేష్ విగ్రహ ఏర్పాటు కోసం ప్రజల నుండి డబ్బులను బలవంతంగా వసూలు చేయరాదన్నారు. గణేష్ మండపాలను ట్రాఫిక్ ఇబ్బంది లేని ప్రదేశాల్లోనే నెలకొల్పాలని స్పష్టం చేశారు. మండపం ఏర్పాటు చేసే స్థలం కోసం సంబంధిత శాఖల వారికి సమాచారం ఇవ్వాలని సీపీ సూచించారు. గణేష్ మండళ్ల వద్ద సందర్శించే మహిళలపై, యువతులపై ఈవ్ టీజింగ్ జరుగకుండా మండళ్ల నిర్వాహకులు చూసుకోవాలని పేర్కొన్నారు. డీజే, డీజే మిక్సర్స్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని.. ఆస్పత్రుల వద్ద.. పాఠశాలల వద్ద భారీ శబ్దంతో పాటలు పెట్టవద్దని సీపీ వెల్లడించారు. రాత్రి 10 దాటిన తర్వాత లౌడ్ స్పీకర్లు ఆఫ్ చేయాలని, ఈ విషయంలో సుప్రీంకోర్టు నిబంధనలను పాటించాలని స్పష్టం చేశారు.




స్ఫూర్తిప్రదాత రాజీవ్‌గాంధీ

– మిగతా 2వ పేజీలో..


## జిల్లాలో ఎరువుల కొరత లేదు : కలెక్టర్



**అక్షరటుడే, ఆర్మూర్ :** జిల్లాలో ఎక్కడా ఎరువుల కొరత లేదని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆలూర్ మండలంలోని కల్లెడిలో కలెక్టర్ బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గ్రామంలోని పీహెచ్‌సీని సందర్శించి, ప్రజలకు అందుతున్న వైద్య సేవలను సమీక్షించారు. అనంతరం సహకార సంఘం ఎరువుల గోదాంను తనిఖీ చేసి, అక్కడ నిల్వ ఉంచిన ఎరువుల పరిస్థితిని పరిశీలించారు. రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ స్పష్టం చేశారు. రాబోయే యాసంగి సీజన్‌లో కూడా ఎరువుల కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్.. విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా ఆలూర్ తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. భూభారతి దరఖాస్తుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. ఆయన వెంట ఎంపీడీవో గంగాధర్, తహశీల్దార్ రమేష్, ఏఆర్ఐ రేణుక, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ ఉన్నారు.

## మురికినీటి శుద్ధి కేంద్రాన్ని సందర్శించిన విద్యార్థులు

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని విజ్ఞాన్ స్కూల్ విద్యార్థులు బుధవారం మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ రవిబాబు విద్యార్థులకు మురికినీటి శుద్ధి గురించి.. ప్లాస్టిక్ వాడడం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తమ ఇంటి వ్యర్థాలను తడి, పొడి చెత్తగా వేరుచేసి మున్సిపల్ వాహనాల్లో వేయాలని సూచించారు. వర్షాకాలం వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నిల్వ నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్సై ప్రశాంత్, జవాన్లు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.






## పరిహారం అందేలా చూస్తా..



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** గత కొన్నిరోజులు కురుస్తున్న భారీ వర్షాలకు నియోజకవర్గంలో పంటలు దెబ్బతిన్నాయి. దీంతో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు బుధవారం పంటలను పరిశీలించారు. ఆర్డీవో పార్థసింహారెడ్డి, ఇతర శాఖల అధికారులతో కలిసి నాగిరెడ్డి పేట్ మండలంలోని చిన్నూర్, బంజార తండా, వెంకంపల్లి గ్రామాల్లో దెబ్బతిన్న పంటలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఆందోళన చెందవద్దని, పంట నష్ట పరిహారం అందేలా తగిన చర్యలు తీసుకునేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మంజీర నదిలో వరద పెరుగుతుండడంతో నిజాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి 1.5 లక్షల క్యూసెక్కుల నీటి విడుదల అవసరమని, ఈ మేరకు రాష్ట్ర చీఫ్ ఇంజినీర్, కామారెడ్డి జిల్లా సీఈ, నిజాంసాగర్ ప్రాజెక్ట్ డీఈఈతో మాట్లాడి పరిస్థితిని వివరించారు.



## ఆదాయాన్ని పెంచే మార్గాలను అన్వేషించాలి

**అక్షరటుడే, బాన్సువాడ:** ఆర్టీసీకి ఆదాయాన్ని పెంచే మార్గాలను అన్వేషించాలని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోలోమన్ సూచించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. బాన్సువాడ ఆర్టీసీ డిపోను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశమయ్యారు. సంస్థ ఆదాయాన్ని పెంచే మార్గాలు, ఖర్చులను తగ్గించే చర్యలపై సలహాలు సూచనలు ఇచ్చారు. అందరూ బాధ్యతతో పని చేయాలని సూచించారు. అనంతరం డిపో ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ జ్యోత్స్న, డిప్యూటీ రీజినల్ మేనేజర్ మధుసూదన్, బాన్సువాడ డిపో మేనేజర్ సరితా దేవి పాల్గొన్నారు.

## రేపు శివపార్వతుల కల్యాణం



**అక్షరటుడే, ఇందూరు:** నరగంలోని కోటగల్లి మార్కండేయ మందిరంలో మాస శివరాత్రి సందర్భంగా గురువారం శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు మందిరం ఛైర్మన్ భీమర్తి సురేందర్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఆలయంలో రుద్రాభిషేకం, అర్చన, అన్నపూజ, అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

## ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు

**అక్షరటుడే, బాన్సువాడ:** విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై బాన్సువాడలో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. మండలంలోని తాడ్కోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న గణిత ఉపాధ్యాయుడు గణపతిపై పోక్సో కేసు నమోదైనట్లు ఎంఈవో నాగేశ్వరరావు తెలిపారు. ఉపాధ్యాయుడు తరగతి గదిలోనే పలువురు విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించాడని తల్లిదండ్రులు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల విద్యాధికారి నాగేశ్వర్ రావు, చైల్డ్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ అధికారి స్రవంతి విచారణ చేపట్టారు. అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు తేలడంతో ఉపాధ్యాయుడిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదైంది.

కార్ల అమ్మకం పేరిట కొందరు మోసాలకు పాల్పడుతున్నారు. చాలా మంది మధ్య తరగతి వారు సెకండ్ హ్యాండ్‌లో కార్లు కొనుగోలు చేస్తుంటారు. కొత్త కారు కొనుగోలు చేసే స్థోమత లేక యూజ్డ్ వెహికిల్స్ కొంటారు. పాత కార్లు విక్రయించే పలువురు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. అయితే వీరిలో పలువురు మోసగాళ్లు కూడా ఉంటున్నారు. అసలు కారే లేకున్నా విక్రయించి రూ.లక్షలు సంపాదిస్తున్నారు. ఇలాంటి ఓ ముఠాను కామారెడ్డి పోలీసులు తాజాగా అరెస్ట్ చేశారు. – అక్షరటుడే, కామారెడ్డి




# కార్ల అమ్మకం పేరిట మోసం

▸ ఫేక్ ఆర్సీలతో అద్దె కార్ల విక్రయం ▸ బెదిరించి మళ్లీ లాక్కుంటున్న ముఠా ▸ ఆరుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు

కొంత మంది వ్యక్తులు ముఠాగా ఏర్పడి కార్ల విక్రయాల పేరిట మోసాలకు పాల్పడుతున్నారు. అద్దెకు తెచ్చుకున్న వాహనాన్ని విక్రయించి లక్షలు సంపాదిస్తున్నారు. అనంతరం కారు కొనుగోలు చేసిన వారిని బెదిరించి మళ్లీ ఆ కారును లాక్కుంటున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఏడుగురు ఓ గ్యాంగ్‌గా ఏర్పడ్డారు. వీరు సెల్ఫ్ డ్రైవింగ్ పేరిట కారు అద్దెకు తీసుకుంటారు. అనంతరం దానికి నకిలీ ఆర్సీ, ఇతర పత్రాలు, నంబర్ ప్లేట్ సృష్టిస్తారు. ఆ కారు విక్రయిస్తామని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తారు.

### జీపీఎస్ ట్రాకర్ సాయంతో..

సోషల్ మీడియాలో పోస్ట్ చూసి ఎవరైనా కారు అవసరం



ఉన్న వారు వీరికి ఫోన్ చేయగానే అద్దె కారును అమ్మేస్తారు. గ్యాంగ్‌లోని కొందరు వ్యక్తులు కారు, నకిలీ పత్రాలు ఇచ్చి డబ్బులు తీసుకుంటారు. అయితే అంతకు ముందే ఆ కారుకు వీరు జీపీఎస్ ట్రాకర్ అమరుస్తారు. రెండు మూడు రోజుల తర్వాత గ్యాంగ్‌లోని మరికొంత మంది వ్యక్తులు కారు ఓనర్ దగ్గరకు వెళ్తారు. జీపీఎస్ ట్రాకర్ అమర్చి ఉండడంతో కారు ఎక్కడుందో అక్కడికి నేరుగా వెళ్తారు. ఆ కారు తమదని, ఎలా కొనుగోలు చేశావని బెదిరింపులకు పాల్పడుతారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని భయపెట్టి కారు తీసుకొని వెళ్లిపోతారు. అనంతరం ఆ కారును అద్దెకు తెచ్చిన వారికి అప్పగిస్తారు. అలా వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తారు.

### బయటపడిందిలా..

కామారెడ్డికి చెందిన ప్రశాంత్ గౌడ్ గత నెలలో ఫేస్‌బుక్‌లో పోస్టు చూసి కారు కొనుగోలు చేశాడు. అయితే ఈ గ్యాంగ్ అతడిని బెదిరించి మళ్లీ కారు తీసుకు వెళ్లారు. దీంతో బాధితుడు మాచారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేయగా ముఠా మోసాలు వెలుగులోకి వచ్చాయి. ఏడుగురు వ్యక్తులు ముఠాగా ఏర్పడి ఫేక్ ఆర్సీ, ఫేక్ నంబర్ ప్లేట్లతో కార్లను విక్రయించి తిరిగి చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల్లో ఆరుగురిని అరెస్ట్ చేశారు.


### జాగ్రత్తలు పాటించాలి



సోషల్ మీడియాలో చూసి వాహనాలు, ఇతర వస్తువులు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. వాహనాలకు సంబంధించిన పత్రాలను ఆన్‌లైన్‌లో చెక్ చేసుకోవాలి. నకిలీ పత్రాలతో మోసాలకు పాల్పడుతున్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఎవరిని పడితే వారిని నమ్మొద్దు.

- రాజేష్ చంద్ర, ఎస్పీ, కామారెడ్డి

## మందకృష్ణ మాదిగ సభను విజయవంతం చేయాలి




**అక్షరటుడే, కోటగిరి:** పింఛన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ బోధన్ పట్టణంలో 23న నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి సోంపూర్ పోచీరాం కోరారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నట్లు ఆయన వివరించారు.

## కోటగిరిలో ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు



**అక్షరటుడే, కోటగిరి :** మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కోటగిరి డైమండ్ రవికుమార్ యువసేన ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఇందులో భాగంగా కోటగిరి, పోతంగల్ ఉమ్మడి మండలాల ఫొటోగ్రాఫర్లను సత్కరించారు. కార్యక్రమంలో మండల ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు మక్బూల్, లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్ అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి హనుమంతరావు పటేల్, కోయగూర్ శ్రీకాంత్, కప్ప సంతోష్, యోగేష్, చిన్న అరవింద్, గంగా ప్రసాద్ గౌడ్, డాన్ రాజు, చెర్రీ గంధపు దినేష్ ఫొటోగ్రాఫర్లు పెంటయ్య చారి, అనంత్ చారి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుడికి పాట్నా ఓటర్ అధికార్ ర్యాలీ బాధ్యతలు



**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు నీలం రమేష్‌కు ఆల్ ఇండియా కిసాన్ కాంగ్రెస్ కీలక బాధ్యతలు అప్పగించింది. దేశంలో ఓట్ చోరీ జరిగిందని రాహుల్ గాంధీ ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ అంశంపై రాహుల్ గాంధీ చేపట్టిన కార్యక్రమం సెప్టెంబర్ 1న పాట్నాలో ముగియనుంది. దీంతో ఆల్ ఇండియా కిసాన్ కాంగ్రెస్ నేషనల్ కో-ఆర్డినేటర్‌గా ఉన్న నీలం రమేష్‌కు పాట్నాలో జరిగే ఓటర్ అధికార్ ర్యాలీ ఇన్‌ఛార్జిగా నియమిస్తూ ఆ పార్టీ వైస్ ఛైర్మన్ అఖిలేష్ శుక్లా ఉత్తర్వులు జారీ చేశారు. నీలం రమేష్ గతంలో వైఎస్సార్‌టీపీలో కొనసాగారు. షర్మిలకు సంబంధించి పాదయాత్ర, ర్యాలీలు ఇతర కార్యక్రమాలను నీలం రమేష్ పర్యవేక్షించనున్నారు. ప్రస్తుతం ఆయనకు పాట్నా బాధ్యతలు అప్పగించినందుకు ఆల్ ఇండియా కిసాన్ కాంగ్రెస్ కమిటీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



నాగిరెడ్డిపేట మండలంలో నీటమునిగిన వరిపంట



కోటగిరిలో వరిపంటలోకి చేరిన వరదనీరు

## భారీ వర్షా లకు దెబ్బతిన్న పంటలు..

భారీ వర్షా లు ఉమ్మడి జిల్లాను అతలాకుతలం చేశాయి. చాలా ప్రాంతాల్లో పంటపొలాలు నీటమునిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నిజాంసాగర్, కోటగిరి మండలంలో వరి, సోయా, పత్తి కూరగాయల పంటలు నీటమునిగాయి. చాలా చోట్ల మొక్కజొన్న నేలమట్టమైంది. కూరగాయల పంటలు కూడా నీళ్లలో ఉండి కుళ్లిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరద కారణంగా పొలాలు చెరువుల్లా తలపిస్తున్నాయని వాపోయారు. వ్యవసాయ, రెవెన్యూ అధికా రులు, పొలాలను సందర్శించి, నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. – అక్షరటుడే, నిజాంసాగర్/కోటగిరి



నీటమునిగిన పంటను పరిశీలిస్తున్న అధికారులు

## శిఖం భూమిని కాపాడాలని వినతి

**అక్షరటుడే, నిజాంసాగర్:** నర్వ పాత చెరువు శిఖం భూమిని కబ్జా బారి నుంచి కాపాడాలని రైతులు కోరారు. ఈ మేరకు బుధవారం మహమ్మద్‌నగర్ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి మండలం వెంకటాపూర్‌కు చెందిన కొందరు రైతులు శిఖం భూమి కబ్జా చేసుకుని పంటలు పండిస్తున్నారన్నారు. అక్రమంగా ఏర్పాటు చేసిన బోరు మోటార్లను తొలగించాలని విన్నవించారు. శిఖం భూ కబ్జాదారులపై చర్యలు తీసుకుని చెరువును కాపాడాలని గ్రామ ఆయకట్టు ప్రాంత రైతులు, గ్రామస్థులు కోరారు.



## అదృశ్యమైన బాలుడి ఆచూకీ లభ్యం..



**అక్షరటుడే, మోపాల్ :** ఇంట్లో నుంచి వెళ్లిపోయిన బాలుడి ఆచూకీ లభ్యమైంది. మోపాల్ మండలం కులాస్‌పూర్‌కు చెందిన వడ్డేపల్లి గంగాధర్ మనవడు బొద్దుల వరుణ్ డిచ్‌పల్లి ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. ఇటీవల బాలుడు ఇంటికి వచ్చాడు. ఇంట్లో చిన్న గొడవ కావడంతో హాస్టల్‌కు వెళ్తున్నానని చెప్పాడు. అయితే హాస్టల్‌కు వెళ్లలేదు. దీంతో కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభించలేదు. వారు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిజామాబాద్ బస్టాండ్, రైల్వే స్టేషన్ సమీపంలో వరుణ్ తిరుగుతున్నట్లు గుర్తించారు. రైల్వే స్టేషన్‌లో ఉన్న బాలుడిని రైల్వే పోలీసులు విచారించారు. అనంతరం మోపాల్ పోలీసులకు అప్పగించారు. వారు వరుణ్‌ను కుటుంబ సభ్యులకు అప్పగించారు.



నగరంలో రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..




హైదరాబాద్‌లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న వినయ్‌రెడ్డి



ఆలూర్ మండలంలోని కల్లెడి గ్రామంలో..

### స్ఫూర్తిప్రదాత రాజీవ్‌గాంధీ

ఉమ్మడిజిల్లాలో దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశాన్ని అభివృద్ధికి బాటలు వేసిన గొప్ప నేత రాజీవ్ గాంధీ అని.. యువతకు ఆయన స్ఫూర్తిప్రదాత అని వక్తలు పేర్కొన్నారు.

– అక్షరటుడే, నెట్‌వర్క్



బాన్సువాడ పట్టణంలో..



ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో..



పిట్లం మండల కేంద్రంలో..

## అంబులెన్స్‌ను ఢీకొన్న లారీ..



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** పేషెంట్‌తో వెళ్తున్న అంబులెన్స్‌ను లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రోగితో పాటు, బంధువులు, అంబులెన్స్ డ్రైవర్ గాయపడ్డారు. నగరంలోని కంఠేశ్వర్ బైపాస్ రోడ్డులో బుధవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నందిపేట మండలం చిక్లి గ్రామానికి చెందిన వ్యక్తిని బంధువులు అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు వస్తున్నారు. బైపాస్ వద్ద అంబులెన్స్‌ను లారీ ఢీకొంది. అంబులెన్స్ డ్రైవర్ రమేష్, ఈఎంటీ నాగిని తీవ్రంగా గాయపడ్డారు. రోగి, ఆయన బంధువులకు సైతం గాయాలయ్యాయి. వారిని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిజామాబాద్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు..



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** సైకిల్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటన నగరంలోని వర్ని రోడ్‌లోని ఆనంద్‌నగర్ వద్ద బుధవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆనంద్‌నగర్ వద్ద బుధవారం ఉదయం ఆర్టీసీ బస్సు ఎదురుగా సైకిల్‌పై వస్తున్న నాగన్న అనే వ్యక్తిని ఢీకొట్టింది. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఐదో టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన పోలీసులు క్షతగాత్రుడిని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే నాగన్న పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించాలని వైద్యులు సూచించారు. బాధితుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఐదో టౌన్ ఎస్సై గంగాధర్ తెలిపారు.